


V న్యూస్
తెలుగు దినపత్రిక
మన ఊరు - మన వార్తలు

Postal Reg.No. MPM/L22/VNEWS/19-21




సంపుటి 9 | సంచిక201 | మచిలీపట్నం విజయవాడ కాకినాడ | గుంటూరు | ఖమ్మం | వైఎస్ఆర్‌కడప | ఒంగోలు, | పొట్టి శ్రీరాములు నెల్లూరూ | 26-12-2022 | సోమవారం | పేజీలు 4 | వెల.రూ 3/-







# కరోనాపై అలర్ట్.. వివిధ రాష్ట్రాల్లో సన్నద్ధత

దిల్లీ: పొరుగుదేశం చైనాలో కరోనా కేసులు పెరిగిపోతుండడం పట్ల కేంద్రం ముందస్తు జాగ్రత్త చర్యలను తీవ్రతరం చేసింది. ప్రజలు వైరస్ నుంచి సురక్షితంగా ఉండేందుకు వీలుగా నివారణ చర్యలు పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆయన సూచన చేశారు. "చాలా దేశాల్లో కరోనా కేసులు పెరిగిపోతుండడాన్ని చూస్తున్నాం. మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మాస్క్ లు ధరించి, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి"అని ప్రధాని కోరారు. మరోవైపు ఆరోగ్య సదుపాయాల సన్నద్ధతను తెలుసుకునేందుకు మంగళవారం నుంచి మాక్ డ్రిల్స్ నిర్వహించాలని అన్ని రాష్ట్రాలను కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది. ఒకేసారి కేసులు పెరిగిపోతే వచ్చే రోగులకు చికిత్స అందించేందుకు వీలుగా సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని సూచించింది. తగినంత ఆక్సిజన్ నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లైఫ్ సపోర్ట్ యాంత్రాల పనితీరును చెక్ చేసుకోవాలని కోరింది. మరోవైపు ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చే విదేశీ ప్రయాణికులను ర్యాండమ్ గా పరీక్షిస్తున్నారు. శనివారం సుమారు 25 వేల మంది ప్రయాణికులు రాగా, వారిలో 500 మందిని పరీక్షించారు.చైనా, జపాన్ సహా వివిధ ప్రపంచ దేశాల్లో కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తుండటంతో భారత్ అప్రమత్తమైంది. ఇప్పటికే రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలను అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం... వైద్య రంగం సన్నద్ధతపై మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించాలని సూచించింది. చైనా, దక్షిణ కొరియా, జపాన్, థాయిలాండ్, హాంకాంగ్ తదితర దేశాల్లో కరోనా కేసులు భారీగా నమోదవుతుండటంతో అక్కడి నుంచి వచ్చిన వారికి ఆర్‌టీ -పీసీఆర్ టెస్టులు తప్పనిసరి చేసింది. ప్రతి ఒక్కరు మాస్కులు ధరించాలని, రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉంటూ కొవిడ్ నిబంధనలు పాటించాలని కోరుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సన్నద్ధతపై టాప్ 10 పాయింట్లు.

1 హిమాచల్‌ప్రదేశ్‌లో క్రిస్మస్ సందర్భంగా పర్యాటకుల తాకిడి పెరిగింది. దీంతో అప్రమత్తమైన అక్కడి ప్రభుత్వం కొవిడ్ నిబంధనలు విధించింది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించింది. ప్రజలంతా కొవిడ్ నిబంధనలు పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మన్‌కీ బాత్‌లో మాట్లాడిన ఆయన ప్రపంచంలోని అనేక దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండటం చూస్తున్నామని.. ఈ తరుణంలో మనమంతా జాగ్రత్తగా ఉండటం అవసరమన్నారు. మాస్కులు ధరిద్దాం..



చేతుల్ని శుభ్రం చేసుకుందాం అని పిలుపునిచ్చారు.

2 వివిధ దేశాల్లో మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండటంతో తమ రాష్ట్రం అప్రమత్తంగా ఉందని బిహార్ సీఎం నీతీశ్ కుమార్ అన్నారు. కరోనా పరీక్షలు చేయడంతో పాటు వ్యాక్సిన్లూ సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రోజూ 45 వేల నుంచి 50 వేల టెస్టులు చేస్తున్నట్టు చెప్పారు. కేంద్రమూ జాగ్రత్తగా ఉందన్న ఆయన.. బయటి దేశాల నుంచి వచ్చేవారిపట్ల మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

3 బీఎఫ్.7 వేరియంట్‌తో భారత్‌లో అంతగా భయాందోళనలు అవసరం లేదని వైద్యరంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే చాలా మంది ప్రజలు టీకాలు పొందడం ద్వారానో, లేదంటే కొవిడ్ బారిన పడటం మూలంగా ఇమ్యూనిటీని కలిగి ఉన్నారని తెలిపారు. చైనాలో కఠిన ఆంక్షల కారణంగా అక్కడి ప్రజలు తక్కువ ఇమ్యూనిటీతో ఉండటం వల్లే అక్కడ వైరస్ విజృంభణ అధికంగా ఉన్నట్టు సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అధిపతి డా.జుగల్ కిశోర్ విశ్లేషించారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీలంగా ఉందని.. శాస్త్రీయమైన సూచనలు చేస్తోందన్నారు. ఇతర దేశాల్లో కొవిడ్ కేసులు భారీగా పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

4 ప్రపంచ దేశాల్లో కరోనా కేసులు పెరుగుతుండటంతో ఎదుర్కొనేందుకు కర్ణాటక ప్రభుత్వం వ్యూహం రచించనుంది. ఇందులో భాగంగా ఆరోగ్య, విపత్తు నిర్వహణ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు సోమవారం సమావేశమై చర్చిస్తారని సీఎం బసవరాజ్ బొమ్మై వెల్లడించారు. ఆరోగ్యమంత్రి సుధాకర్, విపత్తు నిర్వహణ సంస్థ మంత్రి ఆర్.అశోక సోమవారం వైద్యరంగ, సాంకేతిక నిపుణులతో భేటీ అయ్యి వాస్తవ పరిస్థితులపై చర్చిస్తారన్నారు. న్యూ ఇయర్ వేడుకలు, పండుగల సీజన్ నేపథ్యంలో ఎలాంటి నిబంధనలు ఖరారు చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మన దేశంలో కరోనా పట్ల అంతగా భయపడాల్సిన అవసరం లేకపోయినా అవగాహన ఎంతో ముఖ్యమన్నారు.

5 దిల్లీలోని ప్రభుత్వ ఆస్పత్రులను అధికారులు స్వయంగా వెళ్లి సందర్శించనున్నారు. కరోనా వల్ల ఊహించని పరిస్థితులు ఎదురైతే ఏ మేరకు సన్నద్ధత కలిగి ఉన్నారనే అంశాన్ని పరిశీలించనున్నట్టు అధికారులు తెలిపారు. దిల్లీ ఆరోగ్య శాఖ కార్యదర్శి అమిత్ సింగ్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని జిల్లాల మెజిస్ట్రేట్లు హాజరయ్యారు. ఆస్పత్రుల్లో తగినన్ని పడకలు, ఇతర సామగ్రి సరిపడా ఉన్నాయో లేదో పరిశీలించనున్నారు.

6 ఝార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. కరోనాను నియంత్రించే అంశంపై సన్నద్ధత గురించి ప్రధానంగా చర్చించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

6 కరోనా విషయంలో యూపీ ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైంది. తాజ్ మహల్‌తో పాటు ఇతర ప్రసిద్ధ స్థలాల్లోకి వచ్చే వారికి కొవిడ్ పరీక్షను తప్పనిసరి చేసింది. కొత్త కేసులు వస్తే జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారుల్ని ఆదేశించారు. మాస్కులు ధరించడం, ప్రికాషన్ డోసులు వేయించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు.

8 తమ ప్రభుత్వం 5 పాయింట్ల కార్యక్రమాన్ని అనుసరిస్తుందని మహారాష్ట్ర ఆరోగ్యమంత్రి తానాజీ సావంత్ వెల్లడించారు. కరోనాను ఎదుర్కొనేందుకు టెస్ట్, ట్రాక్, ట్రీట్, వ్యాక్సినేట్‌తో పాటు కొవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విమానాశ్రయాల్లో ర్యాండమ్ థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు.

9 దేశంలో శనివారం 236 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 3,424కి చేరింది. అలాగే, కేరళ, మహారాష్ట్రలో ఒక్కొక్కటి చొప్పున మరణాలు నమోదు కావడంతో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు మృతుల సంఖ్య 5,30,693కి చేరింది. మొత్తం ఇన్‌ఫెక్షన్లలో యాక్టివ్ కేసులు 0.01 శాతం ఉండగా.. రికవరీ రేటు 98.80 శాతంగా ఉన్నట్టు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది.

## గుండెపోటుతో మృతి చెందిన చలపతిరావు

అమెరికాలో ఉన్న ఇద్దరు కుమార్తెలు నివాళి అర్పిస్తున్న సినీ, రాజకీయ ప్రముఖులుటాలీవుడ్ సీనియర్ నటుడు చలపతిరావు కన్ను మూశారు. కైకాల సత్యనారాయణ కన్నుమూసి రెండు రోజులు కూడా కాకముందే చలపతిరావు కన్నుమూయడంతో సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయింది. ఈ తెల్లవారుజామున తన కుమారుడు, నటుడు, దర్శకుడు రవిబాబు నివాసంలో ఆయన మృతి చెందారు. ఆయన ఇద్దరు కుమార్తెలు అమెరికాలో ఉంటున్నారు. వారు వచ్చేంత వరకు భౌతికకాయాన్ని ఉంచనున్నారు. అభిమానుల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని రవిబాబు నివాసంలోనే ఉంచనున్నారు. మధ్నాహ్నం 3 గంటల తర్వాత మహాప్రస్థానంలోని ఫ్రీజర్ లో ఉంచుతారు. బుధవారంనాడు అంత్యక్రియలను నిర్వహించనున్నారు. మరోవైపు చలపతిరావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపాన్ని ప్రకటిస్తున్నారు



## :రైల్వే ప్రైవేటీకరణ.. అబ్బే అదేం లేదే, పార్లమెంట్‌లో మంత్రి అశ్వినీ



దిల్లీవైష్ణవ్భారతీయ రైల్వేలో 80 శాతం రైల్వే టిక్కెట్లు ఆన్ లైన్‌లో అమ్ముడవుతున్నాయని, రైల్వే సేవలు, డేటాబేస్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా రిజర్డ్వ్, అన్ రిజర్డ్వ్ టికెట్ల బుకింగ్‌తో పాటు ఇతర రైల్వే సేవలను అందించడానికి వివిధ ప్లాట్‌ఫామ్‌లపై మొబైల్ అప్లికేషన్ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.భారతీయ రైల్వేలు వినియోగించే టెక్నాలజీతో ప్రయాణీకులు- సరుకు రవాణా, ప్రాజెక్ట్, ఆపరేషన్స్ -నిర్వహణ, తయారీ, కార్యకలాపాలు - నిర్వహణ, ఫైనాన్స్, మెటీరియల్స్ - మానవ వనరుల వంటి విభాగాల్లో అవసరాలు తీరుస్తాయని అన్నారు. అంతేకాకుండా, భారతీయ రైల్వే కొత్త 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద 1,000 చిన్న ఇంకా ముఖ్యమైన స్టేషన్లను ఆధునీకరించాలని యోచిస్తోంది. ప్రత్యేక పునరాభివృద్ధి కార్యక్రమం కింద 200 పెద్ద స్టేషన్లను పునరుద్ధరించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఆ ఆలోచనే మాకు లేదు

భారతీయ రైల్వేను ప్రైవేటీకరణ చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో అడిగిన ఓ ప్రశ్నకు అశ్వినీ వైష్ణవ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. గతంలో తాము చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామని, మరోసారి భారతీయ రైల్వే ప్రైవేటీకరణ కాదని తేల్చి చెప్పారు. రైల్వే మంత్రి ప్రకటన అనంతరం రైల్వే ప్రైవేటీకరణపై వస్తున్న వార్తలకు చెక్ పడినట్లైంది.

## పులివెందుల సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



వైఎస్సార్ కడప: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పాటు కడప జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా మూడో రోజున పులివెందుల సీఎస్ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. అనంతరం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో సీఎం జగన్ పాల్గొన్నారు. సీఎం జగన్ క్రిస్మస్ శుభాకాంక్షలుప్రపంచవ్యాప్తంగా ఆదివారం ప్రజలందరూ క్రిస్మస్ పండుగను జరుపుకోనున్నారు. కాగా, క్రిస్మస్ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, ప్రేమ, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలు. మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రజలకు కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు లభించాలని ఆకాంక్షించారు సీఎం వైఎస్ జగన్.



## మంచు కురిసే వేళలో...

మంచు కురిసే వేళలో ప్రకృతి ప్రియులను ఉల్లాసపరిచే పొగమంచు సోయగాలు కనులకు విందు.. మనసుకు ఆహ్లాదం. ముత్యాలు రాలినట్లుగా పడే మంచు తుంపర్లు... గజగజ వణికించే చలి... వేడివేడిగా పొగలుగక్కుతున్న కాఫీ... మనసును ఉల్లాసపరుస్తుంది. ఈ అద్భుతమైన వాతావరణం కారణంగా ప్రతి ఒక్కరూ మెత్తగా హత్తుకునే గాలిలోని ఏదో ఒక అద్భుతాన్ని అనుభవిస్తారు. తక్కువ ఉష్ణోగ్రతలు, గాలిలో కలిసి చల్లగా తాకే మంచు, మంచు కురుస్తున్న వాతావరణంతో శీతాకాలం ప్రకృతి మత్తుగా... నిద్రపోతున్నట్టుగా వుంటుంది. సూర్యుడు సైతం చురుకుగా వుండడు. కప్పేస్తున్న మంచుగాలులను చీల్చుకొని అప్పుడప్పుడు బయటకు తొంగిచూస్తుంటాడు. అందుకే అంటాడో కవి... 'శీతాకాలం సూర్యుడిలాగా... కొంచెం కొంచెం చూస్తావే' అని. రోజులు చల్లగా వుంటాయి. అందుకేనేమో ఎక్కువమంది శీతాకాలాన్ని ఇష్టపడతారు. 'ఎంతో రసికుడు దేవుడు... ఎన్ని పువ్వులెన్ని రంగు లెన్ని సొగసులిచ్చాడు... అన్నిటిలో నిన్నే చూడమన్నాడు' అంటాడో సినీ కవి. ఈ కాలంలో ప్రకృతి కూడా కొత్త సొబగులతో... సరికొత్త అందంతో వెండివెలుగులతో నిండి వుంటుంది. ఈ కాలాన్ని ఇష్టపడే పువ్వులు, చెట్లు చాలానే వుంటాయి. మంచుతో కప్పబడి కూడా కనువిందు చేస్తుంటాయి.

ఈ కాలంలో హిమాలయ పర్వత ప్రాంతాలే కాకుండా దేశంలోని పలు ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేస్తుంది. మంచు కప్పిన హిమాలయాలు పోతపోసిన వెండికొండల్లా అందమైన చిత్రం గీసినట్లు కనిపిస్తుంటాయి. ఆ దృశ్యాన్ని మంచువానలో తడుస్తూ... భూలోక స్వర్గాన్ని ఆస్వాదిస్తూ... కనులారా చూసి, మనసారా తరించమని ప్రకృతి ఆహ్వానిస్తుంటుంది. ఈ సమయంలో మన ఏజెన్సీ ప్రాంతంలోని వంజంగి, లంబసింగి, చింతపల్లి, పాడేరు, అరకు ప్రాంతాలు పర్యాటకులతో పోటెత్తుతాయి. సూర్యోదయ వేళ మంచు అందాలను తిలకించేందుకు తెల్లవారుజాము నుంచే పర్యాటకులు తరలివస్తారు. ఈ సమయంలో పొగమంచులో బందీ అయిన ప్రకృతి మరింత అందంగా... రమణీయంగా దర్శనమిస్తుంది. పదునెక్కే ఉషోదయ కిరణాలు... చురుక్కుమనిపించే శీతలగాలులు... ప్రియురాలి పంటిగాటులోని మధురిమలా గమ్మత్తుగా వుంటాయి. అలాగే ప్రకృతిలోనైనా, జీవితాల్లోనైనా వైరుధ్యాలు నిరంతరంగాను... సమాంతరంగానూ సాగిపోతుంటాయి. ఇంత చలిలోనూ క్రిస్మస్ జరుపుకొని, కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్న ఉత్సాహం ఒకవైపు, పెరుగుతున్న చలిగాలుల తీవ్రత మరోవైపు సాగుతూనే వుంటాయి.'జ్వలన శిఖిశిఖా సముదయమ్ము నెత్తి, బెబ్బులినివోలె దూకు' చలిని, మంటలతో ఎదుర్కొంటుండగా 'చూపులకు నక్కి వెన్నుపోటు పొడిచె చలి ప్రజాతతిన్' అంటారు బులుసు వెంకటేశ్వర్లు. చలికి తట్టుకోలేక నెగళ్లు వెలిగించినప్పుడు మంటకు ఎదురుగా ఉన్న శరీరభాగం వెచ్చబడుతుంది. అయితే, చలి వెనుక నుంచి దాడి చేస్తుంది. అలాగే, వాతావరణ మార్పులతో భారత్‌లో ఇప్పటికే తీవ్ర ఎండలు, కుండపోత వానలు అధికమయ్యాయి. చలి సైతం పంజా విసురుతోంది. రాబోయే రోజుల్లో వడగాడ్పుల ప్రతాపం మరింత విజంభిస్తుందని ప్రపంచబ్యాంకు నివేదిక తాజాగా హెచ్చరించింది. కాలుష్యంతో పర్యావరణం దెబ్బ తిని... కాలచక్రం గతులు తప్పుతోంది. మంచు కాలంలో విపరీతంగా మంచుకురవడం.. వర్షాకాలంలో అధిక వర్షాలు పడటం.. ఎండాకాలంలో ఎక్కువ ఎండలు కాయటం దీని ప్రభావమే. అందులో భాగంగానే ప్రస్తుతం అధిక చలి, ఎక్కువ మంచు. ఇది ఎంత ఆహ్లాదకరంగా వుంటుందో, ఎంత ఉల్లాసాన్నిస్తుందో... అంతే ప్రమాదకరమైనది కూడా. అమెరికాలో మంచు విపరీతంగా కురియడం, చలిగాలులు ఉధృతం కావడంతో 12 రాష్ట్రాల్లో అత్యయిక స్థితిని ప్రకటించారు. రుతువుల వర్ణనలు చూడటానికి, వినడానికి ఎంత బావుంటాయో... అనుభవం మాత్రం కొన్ని సందర్భాల్లో అంతకంటే దుర్భరంగా వుంటుంది. 'ప్రక్కలు వంచు, వంచి ముని పండ్లను పండ్లను రాచు... క్రమంగా తలను కాళ్ల సందులోకి దూర్చేలా చేస్తుంది' అంటూ వల్లభరాయ కవి క్రీడాభిరామంలో చెప్పిన సత్యం... వృద్ధులకే కాదు... చలి, మంచు అంటే వణికిపోయేవారికీ అనుభవమే. ఏ కాలంలో అయినా మంచి చెడులు వుంటాయి. సమయా సమయాలను బట్టి ఆయా కాలాలను ఆస్వాదించాలి... ఆనందించాలి. అదే సమయంలో ఆరోగ్యం అన్నిటికంటే ముఖ్యం. శీతాకాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు, తమ శరీరానికి చలి, మంచు పడనివారు అధిక జాగ్రత్తలు తీసుకోవాలి. తస్మాత్ జాగ్రత్త!!

# మీటర్లపై చెప్పేవన్నీ 'స్మార్ట్' మాటలే

**%సీఎం, పెద్దిరెడ్డి ప్రకటనలన్నీ ఉత్తుత్తి గొప్పలే**
**శ్రీకాకుళం పైలట్ ప్రాజెక్టులోనే అనేక లోపాలున్నాయని**
**పీఈజీ అధ్యయనంలో వెల్లడి**

అమరావతి: ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి శ్రీకాకుళంలో మీటర్లపై వివిధ ప్రభుత్వ శాఖలపై సమీక్షల్లోను, అసెంబ్లీలోను, విలేకరుల సమావేశాల్లోనూ సందర్భం వచ్చినప్పుడల్లా గొప్పలు చెబుతున్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు అమర్చితే రైతుల కరెంటు కష్టాలన్నీ చిటికెలో మాయమైపోతాయన్నట్టుగా, స్మార్ట్‌మీటర్లే సర్వరోగ నివారిణి అన్నట్టుగా... వాటితో వ్యవసాయ విద్యుత్తు రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చేస్తాయన్నట్టుగా చెబుతున్నారు. ఇదంతా ఒక పథకం ప్రకారం.. స్మార్ట్‌మీటర్లు గొప్పగా పనిచేస్తాయని, వాటివల్ల అద్భుతమైన ఫలితాలు వస్తాయని ప్రచారం చేస్తూ, ఆ ముసుగులో ఆ కాంట్రాక్టులో అత్యధిక భాగాన్ని అస్మదీయునికి చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టేందుకు పన్నిన పన్నాగమని అర్థమైపోయింది. వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటుతో అద్భుతాలు జరిగిపోతాయని ముఖ్యమంత్రి, మంత్రి చెబుతున్న మాటలన్నీ అబద్ధాలని శ్రీకాకుళం జిల్లాలో జరిగిన పీఈజీ అధ్యయనంతో తేటతెల్లమైంది. వారి మాటల్లోని డొల్లతనం బయటపడింది. శ్రీకాకుళంలో కొద్దిసంఖ్యలో ఐఆర్‌డీ మీటర్లను ఏర్పాటుచేసి, ఏడాది కాలంలో అనుభవంలోకి వచ్చిన అంశాల ఆధారంగా గాల్లో లెక్కలు వేసి.. రాష్ట్రమంతా 18.58 లక్షల స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తామనడం ఎంత తెలివితక్కువతనమో పీఈజీ అధ్యయనం స్పష్టంచేసింది. ఆ నివేదిక ఆధారంగానే ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిస్కంలకు లేఖలు రాశారు. పోనీ అన్ని మోటార్లకూ మీటర్లు పెట్టాలన్నా.. ఐఆర్‌డీ మీటర్లే పెడితే మొత్తం రూ.870.40 కోట్లతో అయిపోతుందని, స్మార్ట్‌మీటర్లకు ప్రభుత్వం చేయాలనుకున్న ఖర్చు దీనికంటే ఏడెనిమిది రెట్లు ఎక్కువని ఆయన పేర్కొన్నారు.

### ఐఆర్‌డీ మీటర్లకే సవాలక్ష సమస్యలు

వ్యవసాయ పంప్‌సెట్లు మారుమూల ప్రాంతాల్లో ఉండటంతో శ్రీకాకుళం పైలట్ ప్రాజెక్టులో అనేక సమస్యలు వచ్చాయని పీఈజీ గుర్తించింది. ప్రకృతి శక్తుల నుంచి మీటర్లను కాపాడటం కష్టమవుతోందని తెలిపింది. ఐఆర్‌డీ మీటర్ల కంటే స్మార్ట్‌మీటర్లు సున్నితంగా ఉంటాయి కాబట్టి, మరిన్ని ఎక్కువ సమస్యలు వస్తాయని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి డిస్కంలను అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో వ్యవసాయేతర విద్యుత్ మీటర్ల సమర్థత 95% ఉంటే, శ్రీకాకుళం జిల్లాలో అమర్చిన మీటర్ల సమర్థత 55%.. అంతకంటే తక్కువగా నమోదైంది. ఏడాది కాలంలో మీటర్లు విఫలమవడం, కాలిపోవడం 12-21 శాతంగా నమోదైంది. 'శ్రీకాకుళం జిల్లాలో సేకరించిన సమాచారం ఆధారంగా రాష్ట్రమంతా వ్యవసాయ మోటార్లకు మీటర్లు అమర్చడంపై నిర్ణయం తీసుకోవాలనుకుంటే మరికొంత కాలం ఆగాలి. శ్రీకాకుళంలో వ్యవస్థ గాడిన పడేవరకూ వేచి ఉండి, మరి కొన్నేళ్లు పరిశీలించాకే ఒక



నిర్ణయానికి రావాలి' అని పీఈజీ నివేదికలో స్పష్టంచేసింది.

### మనుషులు రీడింగ్ తీయాల్సి వస్తే... ఐఆర్‌డీ మీటర్లే మంచిది కదా

'పంప్‌సెట్లు మారుమూల ప్రాంతాల్లో ఉండటం, నెట్‌వర్క్ లేకపోవడంతో స్మార్ట్‌మీటర్ల నుంచి సమాచార ప్రసారం సరిగ్గా జరగదు. అప్పుడు మనుషులు వెళ్లి రీడింగ్ నమోదుచేయాలి. అలాంటప్పుడు స్మార్ట్‌మీటర్ల కంటే... తక్కువ ఖర్చయ్యే ఐఆర్‌డీ మీటర్లను అమర్చుకోవడం మంచిది' అని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అభిప్రాయపడ్డారు. 'శ్రీకాకుళం జిల్లాలో ఒక్కో ఐఆర్‌డీ పోర్ట్ మీటర్, అనుబంధ పరికరాలకు రూ.2,583.30 చొప్పున ఖర్చయింది. ఆ లెక్కన 18.58 లక్షల మీటర్లకు రూ.480.12 కోట్లు ఖర్చవుతుంది. ఐదేళ్ల నిర్వహణకు మరో రూ.390.3 కోట్లు అవుతుందనుకున్నా, ఐదేళ్లలో ప్రాజెక్టు వ్యయం రూ.870.4 కోట్లే. స్మార్ట్ మీటర్లకయ్యే ఖర్చు కంటే ఇది చాలా తక్కువ' అని తెలిపారు.

### ఫీడర్ ఆధారిత మీటరింగ్ విధానం చాలు

పీఈజీ తన అధ్యయనంలో భాగంగా... అయిదు రకాల మీటరింగ్ అవకాశాల్ని పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్‌లో నమూనా డీటీ మీటరింగ్, ఫీడర్ మీటరింగ్ విధానాన్ని తేలిగ్గా అమలుచేయొచ్చని, కొద్దిపాటి అదనపు ఖర్చు, తక్కువ శ్రమతో అది సాధ్యమవుతుందని తెలిపింది. రాష్ట్రంలో డీటీ ఆధారిత విధానం ఇప్పటికే ఉందని, మరికొన్ని ప్రక్రియలు, శాంప్లింగ్ విధానంతో మీటర్ల డేటా నాణ్యత, మెథడాలజీని మెరుగపరచవచ్చని పేర్కొంది. 'ఏపీలో వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లకు అమర్చిన మీటర్ల సామర్థ్యం మెరుగ్గా ఉంది. గంటగంటకూ డేటా ఎంట్రీ లాంటి విధానాల్ని ఆటోమేషన్ చేయడం, 11 కేవీ, అంతకంటే కిందిస్థాయిలో నష్టాల వాస్తవిక అంచనాల ద్వారా మెరుగైన ఫీడర్ ఆధారిత మీటరింగ్ విధానాన్ని అమల్లోకి తేవచ్చు. ఏపీలో ఫీడర్ల సెపరేషన్ మెరుగ్గానే జరిగింది కాబట్టి ఫీడర్ మీటరింగ్ ద్వారా వ్యవసాయ విద్యుత్ వినియోగం, నష్టాల్ని తేలిగ్గానే అంచనా వేయొచ్చు' అని పీఈజీ తెలిపింది. 'ఏపీలో 67% వ్యవసాయ పంపుసెట్లకు హెచ్‌వీడీఎస్‌ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది. డీటీ మీటరింగ్‌కి నాలుగోవంతు మీటర్లు సరిపోతాయి. మీటర్ల లొకేషన్లు డిస్కంల నియంత్రణలో ఉంటాయి. మొబైల్ డేటా సమస్యలు తగ్గుతాయి. కావాలంటే అక్కడక్కడ కొన్ని వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు పెట్టవచ్చు. వినియోగదారుని స్థాయిలో మదింపు చేయాలనుకుంటే, ప్రతి డీటీ వారీగా వినియోగాన్ని తీసుకుని లెక్క వేయవచ్చు' అని తెలిపింది.వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. 30% విద్యుత్ ఆదా అయింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు త్వరలోనే మీటర్లు ఏర్పాటుచేస్తాం. రైతులకు మెరుగైన విద్యుత్ అందడంతో పాటు, సేవలు మరింత మెరుగవుతాయి.ఈ ఏడాది మే 6న వ్యవసాయ శాఖపై అధికారులతో సమీక్ష సందర్భంగా సీఎం జగన్ వ్యాఖ్యలుశ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 28 వేల మోటార్లకు మీటర్లు బిగించాం. అక్కడ మంచి ఫలితాలు వస్తున్నాయి. ఆ మీటర్ల వల్ల 30-36% విద్యుత్ ఆదా అవుతోంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా, పారదర్శకత, జవాబుదారీతనం కోసమే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుచేస్తున్నాం.

**అక్టోబరు 25న తిరుపతిలో విలేకరులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 28వేల మోటార్లకు ఐఆర్‌డీ మీటర్లు అమర్చి... వాటివల్ల ఏడాదిలో రైతుల కోసం ప్రభుత్వం చెల్లించే రాయితీ మొత్తంలో 23-36% ఆదా చేయగలిగామని లెక్కలు వేసి, వాటి ప్రాతిపదికన రాష్ట్రవ్యాప్తంగా 18.58 లక్షల స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని సమర్థించుకోవాలనుకోవడం, స్మార్ట్‌మీటర్లపై పెట్టే సుమారు రూ.6,500 కోట్ల పెట్టుబడిని ఐదేళ్లలో వెనక్కు రాబట్టుకోగలమని చెప్పడం అసంబద్ధం. శ్రీకాకుళం పైలట్ ప్రాజెక్టు సమాచార నాణ్యతపై సందేహాలున్నాయి. అక్కడ 37% మీటర్లలో విద్యుత్ వినియోగం సున్నాగా నమోదైంది. అత్యధికశాతం విద్యుత్తును కొద్దిమందే వినియోగించారు. దీన్నిబట్టి చూస్తే... శ్రీకాకుళంలో మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ రాయితీ ఆదా అయ్యిందని చెప్పడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్టుపై ప్రఖ్యాత ఇంధన పరిశోధన సంస్థ ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ (పీఈజీ)తో ఆర్థికశాఖ చేయించిన అధ్యయనంలో వెల్లడైన అంశాల ఆధారంగా... డిస్కంలకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ ఏడాది సెప్టెంబరులో రాసిన లేఖలో పేర్కొన్న అంశాలివి.

### వాస్తవంగా తగ్గిన విద్యుత్ వినియోగం 15-20 శాతమే

శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు వల్ల వాస్తవంగా తగ్గిన విద్యుత్ వినియోగం 15-20 శాతం మాత్రమేనని పీఈజీ నివేదిక పేర్కొంది. ఎంత తగ్గినా.. దాన్ని సబ్సిడీ లెక్కల్లోకి మార్చి రాయితీ ఇంత తగ్గిందని చెప్పలేమని స్పష్టంచేసింది. డిస్కంలు అంత తక్కువ వ్యవధిలో పంపిణీ నష్టాల్ని తగ్గించుకోవడం కష్టమని తేల్చిచెప్పింది. 36% నష్టాల్ని తగ్గించామనుకుని, దాని ఆధారంగా ఇంత పెట్టుబడి వెనక్కి తిరిగి వస్తుందని లెక్కలు వేసుకోవడం సరికాదని స్పష్టంచేసింది.

# పింఛనుదార్లపై పిడుగు

అమరావతి: 'అందరూ ఉన్నా అనాథలా జీవితం.. పనిచేసుకుని బతుకుదామంటే శక్తి చాలదు.. జబ్బు చేస్తే మందుల కోసం రూపాయి సాయం చేసేవాళ్లు లేరు. రోజంతా కష్టపడినా పూట గడవడమే కష్టం'.. ఇలా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పుకళాకారులు, ఇతర పింఛనుదారుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. సామాజిక భద్రత పింఛన్లే వీరికి పెద్ద భరోసా. ఇలాంటి పేదలపై వైకాపా ప్రభుత్వ చర్యలు పిడుగుల్లా పడుతున్నాయి. తప్పుడు తడకల సర్వేను ప్రాతిపదికగా తీసుకుని అర్హులను సైతం అనర్హుల జాబితాలోకి చేర్చేస్తుండటంతో లబ్ధిదారులు ఘొల్లుమంటున్నారు. తాజాగా ప్రభుత్వం 1.60 లక్షల మంది పింఛనుదారులకు నోటీసులు జారీ చేసింది. కారు, పొలం లేకున్నా ఉన్నట్లు.. 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగించకున్నా వాడినట్లు, ఇలా పొంతన లేని కారణాలతో నోటీసులు జారీ చేసినవి భారీగా ఉన్నాయి. తాత్కాలికంగా పింఛను నిలిపేశామని, నోటీసు అందుకున్న 15 రోజుల్లో అర్హతను నిరూపించుకోకపోతే శాశ్వతంగా రద్దు చేస్తామని వాటిలో స్పష్టంగా చెప్పేశారు. దీంతో పింఛనుదారులు లబోదిబోమంటున్నారు. గతంలో చేసిన పల్స్ సర్వేలోనూ, వైకాపా ప్రభుత్వం వచ్చాక చేసిన నవశకం సర్వేలోనూ చాలా వరకు తప్పులు నమోదయ్యాయి. వాలంటీర్ల ద్వారా చేయిస్తున్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సైతం తప్పుల తడకే. చాలా ప్రాంతాల్లో ఆధార్ సంఖ్యలను సైతం తప్పుగా నమోదు చేశారు. ఈ సర్వేల ప్రాతిపదికగానే ప్రభుత్వం పింఛన్లను తనిఖీ చేయిస్తోంది. దీంతో అర్హులు కూడా అనర్హుల జాబితాలో చేరుతున్నారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా నోటీసులిస్తూ ప్రభుత్వం పింఛనుదార్లను ముప్పుతిప్పలు పెడుతోంది. లేని కారణాన్ని ఉన్నట్లు చూపిస్తూ, అర్హత నిరూపించుకోవాలని చెబుతుండటంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. వారంతా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.

### ఒక్కో సచివాలయంలో 5 నుంచి 40 మందికి..

ఆరు దశల తనిఖీలో అనర్హులుగా గుర్తించిన వారి పింఛను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు నోటీసుల్లో ప్రభుత్వం పేర్కొంది. వీటిని లబ్ధిదారుకు లేదా వారి కుటుంబసభ్యులకు అందించి ధ్రువీకరణ తీసుకోవాలని సచివాలయాల సంక్షేమ కార్యదర్శులకు ఆదేశాలు అందాయి. ఒక్కో సచివాలయంలో కనీసం 5 నుంచి 40 మంది పింఛనుదారులకు నోటీసులు వచ్చాయి. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు ఎక్కువ మంది ఉన్నారు. నోటీసులు వచ్చిన 15 రోజుల్లో వివరణను రాతపూర్వకంగా తెలియజేయాలని, అర్హత ఉంటే ధ్రువపత్రాన్ని సమర్పించాలని తెలిపారు. లేకుంటే శాశ్వతంగా పింఛను నిలిపేస్తామని స్పష్టం చేశారు. దీనిపై సెర్ప్ అధికారులను వివరణ కోరగా నోటీసులు అందిన వారికి కూడా జనవరి 1న పింఛను ఇస్తామన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ పింఛను నిలిపేయబోమని చెప్పారు.

### ఉన్నది 3 ఎకరాలు.. చూపింది 10 ఎకరాలు

కదిరి మండలం ఆలంపూర్‌కు చెందిన నర్సమ్మ కుటుంబానికి 3 ఎకరాల భూమి ఉంది.

దాన్ని ఇద్దరు కుమారులకూ పంచేశారు. వృద్ధాప్య పింఛనే ఆధారం. ఇప్పుడు ఉన్నట్లుండి ఆమెకు పింఛను నిలిపేస్తామని 2 నోటీసులిచ్చారు. ఒక నోటీసులో 10 ఎకరాల భూమి ఉందని పేర్కొంటే.. ఇంకొక దానిలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారనే కారణాన్ని చూపారు. లేని కారణాన్ని చూపి పింఛను నిలిపేస్తామనడం అన్యాయమని ఆమె వాపోయారు.

### ఒక్క ఇంటికి మూడు విద్యుత్తు కనెక్షన్లున్నాయట..

ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీకి చెందిన బోగాల గుర్రమ్మ వితంతు పింఛను తీసుకుంటున్నారు. ఈమె ఇంటికి ఒకటే విద్యుత్తు కనెక్షన్ ఉంది. కానీ అధికారులు మూడు కనెక్షన్లు ఉన్నట్లు చూపారు. 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వాడుతున్నారని చూపించి అనర్హుల జాబితాలో చేర్చడంతో గుర్రమ్మ ఆందోళనపడుతున్నారు.

### మూడు విద్యుత్తు కనెక్షన్లున్నాయని...

తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన గాజింగం సింహాచలం వృద్ధాప్య పింఛను తీసుకుంటున్నారు. భార్య చనిపోవడంతో కూమార్తె దగ్గర ఉంటున్నారు. తన పేరు మీద 3 మీటర్లు ఉన్నాయని, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగం ఉన్నట్లు చూపి నోటీసులిచ్చారని వాపోయారు. తన పేరు మీద ఒక్క మీటరే ఉన్నదని అదీ పరిమితికి లోబడే విద్యుత్తు వాడుతున్నామని చెప్పారు.

### పింఛనే ఆధారమైన అవ్వకు.. కారుందని నోటీసు

ఈ వృద్ధురాలి పేరు కొండ్ర నూకాలమ్మ. అనకాపల్లి జిల్లా డీఎల్‌పురం గ్రామం. వృద్ధాప్య పింఛను తీసుకుంటూ కుమార్తె వద్ద జీవనం సాగిస్తోంది. ఇప్పుడు ఈమె పేరిట నాలుగు చక్రాల వాహనం ఉందంటూ నోటీసిచ్చారు. కారు లేదని నిరూపించుకోకపోతే పింఛను రద్దు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. లేని కారు ఉన్నట్లు చూపడంపై నూకాలమ్మే కాదు స్థానికులు సైతం విస్తుపోతున్నారు.

### చనిపోయిన వ్యక్తి ఆదాయపన్ను కట్టాడట!

ఉరవకొండ, విడపనకల్లు, న్యూస్‌టుడే: పాతికేళ్ల కిందట మృతి చెందిన వ్యక్తి ఆదాయపన్ను కట్టాడంటూ ఓ ఒంటరి మహిళ పింఛను తొలగింపునకు అధికారులు నోటీసులు జారీ చేసిన విచిత్రమిది. అనంతపురం జిల్లా విడపనకల్లుకు చెందిన తాతప్పగారి లక్ష్మీదేవి భర్త మోహన్ ఆరేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. లక్ష్మీదేవి తనకొచ్చే వితంతు పింఛనుతోపాటు కూలి పనులు చేయగా వచ్చిన డబ్బుతో ముగ్గురు బిడ్డలను చదివించుకుంటున్నారు. వారి కుటుంబం ఆదాయపన్ను చెల్లిస్తోందన్న కారణంతో ఆమె పింఛను తొలగింపుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు నోటీసిచ్చారు. కూలి చేసుకుని బతికే తాము ఆదాయపుపన్ను ఎక్కడి నుంచి కడతామని అధికారులను ప్రశ్నించగా, వారి కుటుంబంలో 25 ఏళ్ల క్రితం మృతి చెందిన కుటుంబసభ్యుడు ఒకరు చెల్లించారని చెప్పారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# ఫీజు చెల్లించండి.. స్మార్ట్ కార్డు అడగొద్దు




**అమరావతి:** మీరు ఏదైనా కొత్త వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకొని దాని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) కోసం ఎదురుచూస్తున్నారా? డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్) పరీక్షలో అర్హత సాధించి డీఎల్ కార్డు ఎప్పుడొస్తుందా అని వేచిచూస్తున్నారా? అయితే వాటి గురించి మరచిపోవాల్సిందే. ఇప్పట్లో కార్డులు వచ్చే పరిస్థితి లేదు. ఒక్కో కార్డుకు రూ.200 చొప్పున ఫీజును ముందుగానే రవాణాశాఖ వసూలు చేసినా వాటిని ఎప్పటికి జారీ చేస్తారనేది చెప్పే పరిస్థితి లేదు. పక్క రాష్ట్రాల్లో కార్డులు జారీ చేస్తున్నారు కదా? ఇక్కడెందుకు ఇవ్వలేరు? అని అడిగినా బదులివ్వరు. అసలు స్మార్ట్ కార్డులతో పనిలేదని, నకలు కాపీలుంటే చాలని అధికారులు ఉచిత సలహా ఇస్తుంటారు. ఇది రవాణాశాఖలో జరుగుతున్న తంతు. రాష్ట్రంలో రవాణాశాఖ ద్వారా ఆర్సీ, డీఎల్ స్మార్ట్ కార్డుల జారీ ఏడాదిన్నరగా నిలిచిపోయింది.

### రోజుకు 10వేల కార్డులు

రాష్ట్రంలో రోజుకు సగటున 10 వేల వరకు ఆర్సీ, డీఎల్ కార్డులు జారీ కావాల్సి ఉంది. సాధారణంగా ఇవి వారం, పది రోజుల్లోనే పోస్టులో ఇళ్లకు చేరాలి. 2019 నుంచి వీటి పంపిణీలో ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ కార్డులు సరఫరా చేసే గుత్తేదారుకు డబ్బు చెల్లించకపోవడంతో.. నెలల తరబడి సరఫరా నిలిచిపోయింది.

### ఫీజు తీసుకుంటారు.. నిధులివ్వరు!

ఏటా 36 లక్షల కార్డులను పరిగణిస్తే.. ఒక్కో కార్డుకు రూ.200 ఫీజు చొప్పున మొత్తం రూ.72 కోట్ల వరకు సొమ్ము ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది. ఒక్కో కార్డు కొనుగోలు, దానిపై వివరాలు ముద్రణకు రూ.70కి మించి ఖర్చు కాదు. ఒక్కో కార్డుపై ప్రభుత్వానికి రూ.130 చొప్పున మిగులుతుంది. అంటే రూ.72 కోట్లలో వెచ్చించాల్సింది రూ.25 కోట్లు మాత్రమే. అయినాసరే దానిని కూడా ఖర్చుచేసేందుకు రాష్ట్రప్రభుత్వానికి మనసు రావడంలేదు. పాత గుత్తేదారును పదేపదే తిప్పించి, వాయిదాల రూపంలో బకాయి చెల్లించారు. ఆ గుత్తేదారు వైదొలిగాడు. ఇప్పుడు కార్డులు సరఫరా చేసేవారే లేరు.

### టెండరు పిలవకుండా కాలయాపన

స్మార్ట్‌కార్డుల సరఫరాకు సంబంధించి టెండర్లు ఖరారు చేయకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. కార్డులు సరఫరా చేసే గుత్తేదారులకు ఎంత కాలానికి ఓసారి చెల్లింపులు చేయాలి? ఆ కార్డులపై వివరాలు రాష్ట్రమంతా కలిపి రవాణాశాఖ కమిషనరేట్‌లో ముద్రించాలా? జిల్లాల వారీగా ముద్రించాలా? లాంటి అనేక సందేహాలను ఆర్థికశాఖ వ్యక్తం చేస్తూనే ఉంది. వీటికి రవాణాశాఖ తగిన స్పష్టత ఇస్తున్నప్పటికీ.. స్మార్ట్ కార్డుల సరఫరా టెండరు డాక్యుమెంట్‌కు తుది ఆమోదం మాత్రం తెలపడంలేదని సమాచారం. టెండర్లు పిలిచి, గుత్తేదారు ఎంపికై కార్డులు సరఫరా చేశాక.. బిల్లులు చెల్లించే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడంతోనే ఇలా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. టెండర్లు పిలిచి, గుత్తేదారు ఎంపికై కార్డులు సరఫరా చేశాక.. బిల్లులు చెల్లించే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడంతోనే ఇలా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

# ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు చేయుతే విద్యార్థి సహాయ సంస్థ ఉద్దేశం..

(విన్యూస్ -మచిలీపట్నం )::విద్యార్థి సహాయ సంస్థ సర్వసభ్య మరియు దాతల సమావేశం మచిలీపట్నం యుటిఎఫ్ భవన్ నందు సంస్థ అధ్యక్షులు శ్రీ పైడిపాటి రామదేవ్ గారి అధ్యక్షతన జరిగినది. సంస్థ కార్యదర్శి శ్రీ అనుముకొండ వెంకటేశ్వరరావు గారు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టినారు. సంస్థ ఆర్థిక నివేదికను కోశాధికారి శ్రీ అప్పినేడి పోతురాజు ప్రవేశపెట్టినారు. సమావేశమునకు విచ్చేసిన న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ సహాయం చేసే సంస్థలు ఎన్నో ఉన్నాయి కానీ కేవలం విద్య కోసం పేదరికమే గీటురాయిగా ప్రతిభను కూడా పరిగణనలోనికి తీసుకొని నిబద్ధతతో పనిచేస్తున్న సంస్థ కేవలం విద్యార్థి సహాయ సంస్థ మాత్రమేనని, రాబోయే సంవత్సరం లితల్లిదండ్రులు లేని పిల్లలకు అందించే సహాయం నిమిత్తం తాన వంతు విరాళం10,116 కార్యవర్గానికి అందచేశారు. ఈ సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ కె. ఎన్ సత్యనారాయణ 1000 విరాళం కార్యవర్గానికి



అందజేశారు. ఈకార్యక్రమానికి శ్రీ కే.ఏ ఉమామహేశ్వర రావు, శ్రీ ఎం ఎస్ ఎన్ మూర్తి గారు, శ్రీ జాగాబత్తులు లెనిన్ బాబు, శ్రీ చండిక రాజా శ్రీధర్ తదితరులు పాల్గొని విద్యార్థి సహాయ సంస్థ కార్యక్రమాల విస్తృతికి, ఆర్థిక పరిపుష్టికి పలు సూచనలు చేసినారు.

# గందరగోళంలో 'పుష్ప' శ్రీవల్లి కెరీర్!



పుష్ప సినిమా తో పాన్ ఇండియా స్థాయిలో హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రష్మిక మందన్నా. ఈ అమ్మడు బాలీవుడ్.. కోలీవుడ్.. టాలీవుడ్.. శాండిల్ వుడ్ ఇలా అన్ని భాషల్లో వరుసగా సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉందంటూ మొన్నటి వరకు అనుకున్నాం. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కాంతార సినిమా విషయంలో కన్నడం లో అనధికారికంగా రష్మిక పై బ్యాన్ కొనసాగుతుందనే వార్తలు వస్తున్నాయి. కన్నడం లో చాలా కాలంగా రష్మిక మందన్నా సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.. ఇప్పుడు వారే రష్మికను వద్దు అనుకుంటున్నారు అనే ప్రచారం జరుగుతోంది. ఇక కోలీవుడ్ లో విజయ్ కి జోడీగా వారసుడు సినిమాలో నటించింది. ఆ సినిమా సక్సెస్ అయితే తమిళనాట ఆమె జోరు కంటిన్యూ అవ్వబోతుంది. లేదంటే మాత్రం ఆమె కు తమిళ్ లో ఆఫర్లు లేనట్లే.ఇక తెలుగు లో పుష్ప సూపర్ హిట్ అయినా కూడా చిన్న సినిమాలకు నో చెప్పడం వల్ల.. భారీ పారితోషికం డిమాండ్ చేయడం వల్ల పుష్ప 2 సినిమా మాత్రమే ఆమె చేతిలో ఉంది. ఇక హిందీపై ఎక్కువ ఆశలు పెట్టుకున్న ఈ కన్నడ శ్రీవల్లి తీవ్రంగా నిరాశకు గురి అయ్యింది. రష్మిక మందన్నా హిందీలో నటించిన రెండు సినిమాలు కూడా పెద్దగా ఆకట్టుకోలేదు.గుడ్ బై సినిమా థియేటర్ రిలీజ్ అయ్యి నిరాశ పర్చగా మరో సినిమా మిషన్ మజ్ను కనీసం థియేటర్ రిలీజ్ కూడా కాకుండా ఓటీటీ లో విడుదల అయ్యి పెద్దగా కనిపించకుండానే పోయింది. ఇప్పుడు హిందీలో ఈమె చేస్తున్నది ఒకే ఒక్క సినిమా యానిమల్.రణబీర్ కపూర్ కు జోడీగా సందీప్ వంగ దర్శకత్వంలో యానిమల్ సినిమాలో రష్మిక మందన్నా నటిస్తున్న విషయం తెల్సిందే.

ఆ సినిమా వచ్చే ఏడాది లో విడుదల కాబోతుంది. యానిమల్ సక్సెస్ అయితే తప్ప బాలీవుడ్ లో ఈ అమ్మడికి ఆఫర్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.ఇక టాలీవుడ్ లో కూడా పుష్ప 2 తర్వాత మాత్రమే ఆఫర్లు వస్తాయి అంటున్నారు. మొత్తానికి ఈ అమ్మడి కెరీర్ కాస్త ఇబ్బందుల్లో పడ్డట్లు అయ్యింది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. గత ఏడాది బిజీ హీరోయిన్ గా పేరు దక్కించుకున్న రష్మిక ఇప్పుడు ఏం సినిమాలు చేస్తుంది అంటే తక్కున సమాధానం చెప్పడానికి లేకుండా పోయింది.

## బ్యూటీ కాజల్. షైనింగ్‌షైనింగ్..!



సౌత్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత తన మెరుపులు తగ్గాయని కామెంట్స్ వచ్చాయి. ఓ బిడ్డకు తల్లి అయిన తర్వాత సాధారణంగా మహిళల్లో మార్పు రావడం కామన్. అయితే దాన్ని మ్యానేజ్ చేసేందుకు కాజల్ రకరకాల ప్రయత్నాలు చేస్తుంది. లేటేస్ట్ గా శారీ పిక్ లో కాజల్ మెరుపులు మెరిపిస్తుంది. కాజల్ అగర్వాల్ లేటెస్ట్ పిక్స్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ముద్దుగా బొద్దుగా ఉన్న ఈ అమ్మడు తన శారీ లుక్స్ తో ఫ్యాన్స్ ని అలరిస్తుంది.మ్యారేజ్ తర్వాత కొద్దిగా గ్యాప్ తీసుకున్న కాజల్ ఇప్పుడు మళ్లీ ముఖానికి రంగేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో కాజల్ తన గ్లామర్ పిక్స్ తో సోషల్ మీడియాలో సందడి చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు షేర్ చేసిన శారీ పిక్స్ అయితే బ్యూటీ కాజల్ షైనింగ్ షైనింగ్ అనిపించేలా ఉన్నాయి. తన మార్క్ గ్లామర్ షో తో ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని అలరిస్తుంది కాజల్ మళ్లీ తిరిగి సినిమాలతో బిజీ కావాలని చూస్తుంది.కొద్దిపాటి గ్యాప్ తర్వాత కమల్ హాసన్ ఇండియన్ 2 లో నటిస్తున్న కాజల్ ఆ సినిమాతో పెళ్లైనా తన స్టామినా ఏమాత్రం తగ్గలేదని ప్రూవ్ చేసుకోవాలని చూస్తుంది. తన భర్త గౌతం కూడా ఆమె సినిమాలు చేసేందుకు పర్మిషన్ ఇవ్వడంతో కాజల్ ఇక మీదట వరుస సినిమాలు చేయాలని చూస్తుంది.ఇక అందుకు హింట్ ఇస్తూ అమ్మడు సోషల్ మీడియాలో హాట్ షో తో అదరగొట్టేస్తుంది. షేర్ చేసింది శారీ పిక్స్ అయినా కాజల్ నుంచి చాలా రోజుల తర్వాత వచ్చిన క్యూట్ పిక్స్ అవడంతో ఈ ఫోటోలని తెగ వైరల్ చేస్తున్నారు.తెలుగు సినిమాలతో సూపర్ పాపులర్ అయిన కాజల్ పెళ్లి తర్వాత కూడా తన ఫ్యాన్స్ తనని ఆదరిస్తారని గట్టి నమ్మకంతో ఉంది. కమర్షియల్ సినిమాలే కాదు ఫీమేల్ సెంట్రిక్ సినిమాల్లో కూడా కాజల్ నటించాలని ఆసక్తి చూపిస్తుంది. సో కాజల్ సెకండ్ ఇన్నింగ్స్ అన్ని ప్రయోగాలే చేస్తుందని చెప్పొచ్చు. టాలీవుడ్ నుంచి కూడా రీసెంట్ గా ఒకటి రెండు సినిమాల్లో కాజల్ పేరు వినిపించింది. అయితే ఫైనల్ ఎనౌన్స్

## ఎన్టీఆర్ 30.. జాన్వి ఫిక్స్ అయినట్టే..!



టాలీవుడ్ లో తన ఎంట్రీ గ్రాండ్ గా ఉండాలని ప్లాన్ చేసుకున్న శ్రీదేవి కూతురు జాన్వి కపూర్ అనుకున్నట్టుగానే ఒక క్రేజీ మూవీతో ఎంట్రీ ఇస్తుంది. కొన్నాళ్లుగా డిస్కషన్స్ లో ఉన్న ఎన్.టి.ఆర్ 30వ సినిమాలో జాన్వి కన్ఫర్మ్ అయినట్టు తెలుస్తుంది. కొరటాల శివ ఎన్.టి.ఆర్ కాంబోలో వస్తున్న ఈ సినిమాలో హీరోయిన్ గా ఎవరిని తీసుకోవాలి అని కొన్ని నెలలుగా డిస్కషన్స్ నడుస్తున్నాయి. తనకు ఈ ఆఫర్ రాక ముందే మిలి సినిమా ప్రమోషన్స్ కి హైదరాబాద్ వచ్చినప్పుడు ఎన్.టి.ఆర్ తో నటించే ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నా అని చెప్పింది జాన్వి.ఎలాగు పాప ఇంట్రెస్ట్ చూపిస్తుంది కదా అని మేకర్స్ కూడా జాన్వి కపూర్ నే ఎన్.టి.ఆర్ సినిమాకు హీరోయిన్ గా ఫైనల్ చేశారు. స్టార్ తనయురాలిగా బాలీవుడ్ లో వరుస సినిమాలతో దూసుకెళ్తున్న జాన్వి తెలుగులో ఎంట్రీకి సూపర్ ఎగ్జైటెడ్ గా ఉంది. అదీగాక ఎన్.టి.ఆర్ సినిమా అనేసరికి ఇంకాస్త థ్రిల్ అవుతుంది. ఎన్.టి.ఆర్ తో కొరటాల శివ జనతా గ్యారేజ్ సినిమా చేశాడు. ఆ సినిమా తర్వాత మళ్లీ ఇద్దరు కలిసి ఈ మూవీ చేస్తున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ మ్యూజిక్ అందించనున్నారు.తారక్ తో తెలుగు ఎంట్రీ ఇస్తున్న జాన్వి కచ్చితంగా ఇక్కడ కూడా అదరగొడుతుందని చెప్పొచ్చు. శ్రీదేవి కూడా తెలుగులో టాప్ హీరోలందరితో కలిసి నటించింది. ఇక్కడ స్టార్ స్టేటస్ అందుకున్నాక బాలీవుడ్ వైపు వెళ్లింది. అయితే జాన్వి కపూర్ మాత్రం ముందు హిందీ సినిమాల్లో నటించి ఆ తర్వాత తెలుగులో నటిస్తుంది. జాన్వికి ఈ ఆఫర్ లక్కీ ఛాన్స్ అని చెప్పొచ్చు. అంతేకాదు ఈ సినిమాలో నటించడానికి అమ్మడు భారీ రెమ్యునరేషన్ ని డిమాండ్ చేసిందట.యువ సుధ ఆర్ట్స్ ఎన్.టి.ఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న ఎన్.టి.ఆర్ 30వ సినిమా ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అవుతుంది. ఈ సినిమాని పాన్ ఇండియా వైడ్ భారీగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్ తర్వాత ఎన్.టి.ఆర్ చేస్తున్న ఈ సినిమా పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.

## ఆన్ సెట్స్ లో భారతీయుడు పస్తు!



విశ్వనటుడు కమల్ హాసన్ ఆన్ సెట్స్ లో పస్తుంటున్నాడా? కనీసం మంచి నీళ్లు కూడా ముట్టడం లేదా? అంటే అవుననే తెలుస్తోంది. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో కమల్ భారతీయుడు - 2 షూటింగ్ శర వేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆలస్యమైన నేపథ్యంలో వీలైనంత త్వరగా షూట్ పూర్తిచేసి పోస్ట్ ప్రొడక్షన్ కి వెళ్లిపోవాలని శంకర్ ఓ ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.మరి ఈ సినిమా కోసం కమల్ ఇంకెంతగా శ్రమిస్తున్నారో? తెలిసింది మాత్రం చాలా తక్కువ మందికే. ఇందులో కమల్ 90 ఏళ్ల వృద్దిడి పాత్ర పోషిస్తున్నారు. ఆ పాత్ర కోసం కమల్ ప్రొస్తెటిక్ మ్యాకప్ వేసుకుంటున్నారు. ఉదయం సెట్ కి వచ్చినప్పటి నుంచి సాయంత్రం వరకూ అదే మ్యాకప్ తో షూట్ లో పాల్గొంటున్నారు. 90 ఏళ్ల వృద్ధ పాత్ర కావడంతో ప్రొస్తెటిక్ తప్పడం లేదు.అయితే ఈ పాత్ర కోసం కమల్ ఎలాంటి ఆహారం తీసుకోకుండా పస్తుతోనే షూట్లో పాల్గొం టున్నారుట. ఆహారం తీసుకుంటే శరీరంలో వచ్చే మార్పులతో ప్రొస్తెటిక్ కి అవతరాలు ఎదురవుతున్నాయట.దీంతో మంచి నీళ్లు కూడా చాలా తక్కువగానే తీసుకుంటున్నారుట. ఈ నేపథ్యంలో ఉదయం సెట్ కి వచ్చినప్పటి నుంచి సాయంత్రం వరకూ ఎలాంటి ఆహారం లేకుండానే షూట్ ముగిస్తున్నారుట.ఇంటికెళ్లిన

## నిను వీడని నీడను నేను.. రకుల్ ప్రేమ గోల!



టాలీవుడ్ నుంచి నిష్క్రమించాక రకుల్ ప్రీత్ సింగ్ లైఫ్ జర్నీ గురించి తెలిసిందే. ప్రస్తుతం ఈ భామ పూర్తిగా తన స్నేహితుడు జాకీ భగ్నానీ కోసం సమయం కేటాయిస్తోంది. అతడితో డేటింగ్ మ్యాటర్ ఓపెనైన క్షణం నుంచి తనని విడిచి దూరంగా ఉండేందుకు ఇష్టపడడం లేదు. అన్నివేళలా జాకీతో రోమాంచిత జీవితాన్ని ఆస్వాధిస్తోంది. ఈ జంట సహజీవనంపై ఇప్పటికే బాలీవుడ్ మీడియా వరుస కథనాలు వండి వార్చింది. ఈ జంట విషయంలో ప్రతిదీ బహిరంగమే.ఈరోజు జాకీ భగ్నానీ పుట్టినరోజు సందర్భంగా పలువురు టాప్ సెలబ్రిటీలు పార్టీకి అటెండయ్యారు. ఇదే పార్టీలో రకుల్ వైట్ అండ్ సిల్వర్ కలర్ షార్ట్ ఫ్రాక్ లో మెరుపులు మెరిపించింది. రకుల్ తాజా ఫోటోషూట్ తో పాటు మరో అందమైన ఫోటోని సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోగ్రాఫ్ లో రకుల్ ఫ్లోరల్ డిజైన్ ఫ్రాక్ లో కనిపించగా వైట్ షర్ట్ లో జాకీని లవర్ బోయ్ ని తలపించాడు.ాంటా నాకు అత్యుత్తమ కానుకను అందించింది. ఈ జీవితానికి నువ్వే నా కానుక. హ్యాపీ బర్త్ డే మై లవ్.. నా జీవితంలో ఆనందం ప్రశాంతతను నింపిన నా చెలికాడవు. నేను సైలెంట్ అవ్వడానికి కారకుడవు నువ్వు. ఎల్లపుడూ ఇలా చిరునవ్వుతో జీవన మాధుర్యాన్ని ఆస్వాధించేందుకు కారకుడవు! అంటూ జాకీపై ప్రేమను కురిపించింది.ప్రస్తుతం రకుల్ జాకీ భగ్నానీ నిర్మిస్తున్న వరుస చిత్రాల్లో కథానాయికగా నటించనుంది. హిందీ పరిశ్రమలో నటిగా నిర్మాతగా ఎదిగేందుకు ప్రయత్నాల్లో ఉందని సమాచారం. త్వరలోనే ఈ జంట వివాహం జరగనుందని కథనాలొస్తున్నాయి. అయితే దీనిపై రకుల్ అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.ఏదీ దాచను.. పెళ్లిపై స్పందించిన రకుల్రకుల్ ప్రీత్ సింగ్ తాజా చిత్రం 'డాక్టర్ జి' శుక్రవారం నాడు థియేటర్లలోకి వచ్చింది. సినిమాకి మిశ్రమ స్పందనలు వచ్చినా రకుల్ నటనకు పేరొచ్చింది. ఈ చిత్రంలో తన నటనకు ప్రేక్షకుల నుండి ప్రేమ సందేశాలు ప్రశంసలను అందుకుంది. తన నటనపై వస్తున్న సమీక్షలతో రకుల్ ఆనందంలో ఉంది. తాజాగా తన ఇన్స్టాగ్రామ్ వీడియోలో అదే విషయాన్ని వ్యక్తం చేసింది.డాక్టర్ గా రకుల్ నిజాయితీగా నటించి మెప్పించింది. మొదటిసారి ఆయుష్మాన్ ఖురానాతో జంటగా నటించడం ప్రేక్షకులు అభిమానులను మెప్పించింది. సోషల్ మీడియా ద్వారా రకుల్ తన అభిమానులకు విపరీతమైన ప్రశంసలు కురిపిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ''ఆప్కే ప్యార్ సే హుమారా దిల్ ధక్ ధక్ కర్ రహా హై'' అని చెప్పింది. అనుభూతి కశ్యప్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. జంగ్లీ పిక్చర్స్ సమర్పణలో తెరకెక్కింది. ఈ చిత్రంలో షెఫాలీ షా -షీబా చద్దా తదితరులు నటించారు.పెళ్లి వార్తలపై స్పందన ..ఇటీవలే రకుల్ నటించిన డాక్టర్ జి విడుదలైన సంగతి తెలిసిందే. ఈ మూవీ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో తన పెళ్లిపై వస్తున్న వార్తలకు రకుల్ స్పందించింది. గత ఏడాది నవంబర్ లో బాలీవుడ్ నటులు జాకీ భగ్నానీ- రకుల్ ప్రీత్ సింగ్ తమ సంబంధాన్ని సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుండి ఈ జంట చాలా సందర్భాలలో కలిసి కనిపించింది. ఇప్పుడు ఈ జంట పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలనుకుంటున్నట్టు కథనాలొస్తున్నాయి.ఈ వార్తలకు ప్రతిస్పందనగా రకుల్ ఒక ట్వీట్ ను పోస్ట్ చేసింది. ఇప్పటికిప్పుడే తన పెళ్లి జరుగుతుందనే ఆలోచన తమకు లేదని చమత్కరించింది. జాకీ -రకుల్ 2023లో వివాహం చేసుకోబోతున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ తన సోదరి వివాహ ప్రణాళికల గురించి ఇటీవల బహిరంగంగా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ '''జాకీ భగ్నాని దర్శకత్వంలో రకుల్ రెండు సినిమాల్లో నటించింది. వివాహం స్పష్టంగా కార్డులపై ఉంది. కానీ ఇంకా ఏదీ తుది నిర్ణయం తీసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ఆమె స్వయంగా ఆ విషయాన్ని ప్రకటిస్తుంది. అది జరుగుతుందో లేదో నాకు తెలుసు. ఏ సంబంధానికైనా వివాహం క్లైమాక్స్. జాకీ భారతీయ సినిమా అగ్ర నిర్మాతలలో ఒకరు. అతని మనస్సులో చాలా ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ లు ఉన్నాయి. వాస్తవానికి వారిద్దరూ చాలా బిజీగా ఉన్నారు. కాబట్టి వారికి భారీ లక్ష్యాలు ఉన్నాయి'' అని తెలిపారు.అతని వ్యాఖ్యలతో పుకార్లు ఊపందుకున్న తర్వాత రకుల్ ప్రీత్ సింగ్ దానిపై స్పందించింది. తాజా ట్వీట్ లో తన సోదరుని ప్రస్థావిస్తూ మీరు ధృవీకరించారా ? నా జీవితం పై ఎలాంటి వార్తలు లేవని సరదాగా ఉంది.. అని వ్యాఖ్యానించింది.కెరీర్ మ్యాటర్ కి వస్తే...రకుల్ తదుపరి 'థ్యాంక్ గాడ్'లో నటించనుంది. ఈ చిత్రంలో పోలీస్ పాత్రలో నటిస్తుంది. అజయ్ దేవగన్- సిద్ధార్థ్ మల్హోత్రా ఇందులో ఇతర తారాగణం. 'ఛత్రివాలి' అనే టైటిల్ తో తెరకెక్కుతున్న చిత్రంలో కూడా ఆమె నటించనుంది.

Ownedy by EDITOR and Publisher: PREMNATH THOKALA, 26/152, Buttaipet,Machilipatnam, krishna Dist., Printed at Sri Lakshmi ofset
Printer binders, D. no : 32- 26- 126/ 13, opp BSNk Bgavan, chuttagunta, Vijayawada-4 Ph : 08672227347.. cell 9848667347- RNi NO :APTEL/2015/65279